రింగ్‌రోడ్డు చుట్టూ చుక్ చుక్ రైలు


వరంగల్ ఓఆర్ఆర్ 69 కి.మీ.ల మేర రైల్వే ట్రాక్



కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కావ్య

- 28కి.మీ ఎన్‌హెచ్ పూర్తి.. 41 కి.మీ నిర్మాణం పనులు షురూ
- నష్కల్- హసన్‌పర్తి లైన్ కూడా ఓఆర్ఆర్ అనుసంధానంగానే నిర్మాణం
- ఆర్ఆర్‌తో పాటు రైల్వేలైన్‌తో మారిపోనున్న వరంగల్ రూపురేఖలు
- కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని రైల్వేమంత్రికి విన్నపం
- డోర్నకల్ నుంచి భద్రాచలం, గద్వాల్, మిర్యాలగూడ రైల్వేలైన్ల పూర్తికి విజ్ఞప్తి
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

7



ఆకాశం, రోడ్డు, రైలు మార్గాలు ఓరుగల్లు అభివృద్ధికి పునాదులుగా మారబోతున్నాయి. ఇటీవల మామునూరు ఎయిర్‌పోర్టుకు పునరుజ్జీవం పోయగా, ఔటర్ రింగ్ రోడ్డు నగరానికి మణిహారంగా మారింది. అయితే ఇదే రింగు రోడ్డుకు అనుకుని రైల్వే లైన్ నిర్మాణ ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. కరుణాపురం నుంచి ఆరెపల్లి వరకు రింగు రోడ్డు నిర్మాణం పూర్తికాగా, ఆరెపల్లి నుంచి వరంగల్ మీదుగా కరుణాపురం వరకు నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. ఇదే రింగురోడ్డు చుట్టూ ఇపుడు రైల్వే ట్రాక్ నిర్మాణం జరగనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని కుమార్ వైష్ణవ్‌కు విన్నవించడంతో సానుకూలంగా స్పందించారు. కాగా, ఇప్పటికే ప్రతిపాదనలో ఉన్న డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి భద్రాచలం, మిర్యాలగూడ, గద్వాల్ రైల్వే లైన్ల పురోగతిపై కూడా వివరించారు. విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుతో కాజీపేట రైల్వే డివిజన్ ఆవశ్యకతపై విన్నవించగా ఆయన స్పందించారు. కాగా, ఓఆర్ఆర్ చుట్టూ రైల్వే ట్రాక్ నిర్మిస్తే ఓరుగల్లు మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలు, పర్యాటకం, ఉపాధి కల్పనతో నగర రూపురేఖలు మారిపోతాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కమ్యూనిటీ మీడియేటర్స్‌తో సత్వర న్యాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

- వివాదాల పరిష్కారంలో వారి పాత్ర కీలకం
- ఈ విధానం పురోగతిలో మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలు ముందంజ
- పైలెట్ ప్రాజెక్టుగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు
- రాష్ట్రంలో సత్ఫలితాలిస్తున్న కమ్యూనిటీ మీడియేటర్స్ విధానం
- రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్
- కాళోజీ కళాక్షేత్రంలో వలంటీర్ల అవగాహన సదస్సు
- హాజరైన జడ్జిలు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు

7

ముగ్గురిని మింగిన కెనాల్

- కాలువలోకి దూసుకెళ్లిన కారు
- కొడుకుతో బయటకు దూకిన తల్లి
- కారులోనే తండ్రి, కూతురు మృతి
- ఊపిరాడక కుమారుడు..
- ప్రమాదం నుంచి బయటపడ్డ మహిళ
- పర్వతగిరి మండలం కొంకపాక శివారులో ప్రమాదం
- స్వగ్రామం మేచరాజు పల్లిలో విషాదఛాయలు
- కన్నీరు మున్నీరవుతున్న బాధిత కుటుంబం

6



ప్రవీణ్‌కుమార్ (ఫైల్), కూతురు చైత్ర సాయి, కుమారుడు ఆర్యవర్ధన్ (ఫైల్)

హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం..



కాసులపాడులో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం
- ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో ఆయన శనివారం విస్తృతంగా పర్యటించారు. ఆకినపల్లి, పెద్దకోమటిపల్లి, పర్లపల్లి, మొట్లపల్లి, కాసులపాడు, పిడిసిల్ల, ములుకలపల్లి, మొగుళ్లపల్లి, రంగాపురం గ్రామాల్లో రూ. 9 కోట్ల 90 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్లు, బీటీరోడ్ల మరమ్మతులు, నూతన బీటీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బంగ్లపల్లిలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని చెప్పారు. వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం పాటుపడుతోందని అన్నారు. రోడ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్ పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

పర్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యేకు మహిళల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వారికి ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శులను ఎమ్మెల్యే సత్యనారాయణరావుసన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, కాంగ్రెస్ జిల్లా నాయకులు కట్టంగూరి రాం నరసింహారెడ్డి, సంపెల్లి నర్సింగరావు, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, పట్టణ అధ్యక్షుడు ఖ్యాతరాజు రమేష్, మండల నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, ఖ్యాతరాజు సాంబమూర్తి, పోలేని లింగారావు, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



భూపాలపల్లిలోని సింగరేణి ఇల్లందుక్లబ్ గెస్ట్‌హౌస్‌లో జరిగిన వేడుకల్లో నృత్యం చేస్తున్న మహిళలు

ఆకాశాన్నంటే ఆత్మవిశ్వాసం 'ఆమె'ది. ప్రతిబంధనలను తెంచుకోవాలనే స్థైర్యం ఆమె సొంతం. ప్రేమ, కరుణ, ఓర్పుకు నిలువుటద్దం.. నారీమణి. గృహం నుంచి గగనం దాకా అలుపెరుగని ప్రయాణం ఆమెది. సమానత్వపు స్వప్నాలను కళ్లల్లో నింపుకొని సామాజిక మార్పు కోసం పరితపించే మౌన విప్లవం.. నగటు మహిళ. ఎప్పటి లాగే ఈ ఏడాది కూడా మహిళా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్త్రీశక్తిని కీర్తించే వేడుకను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించేనట్టుగానే భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోనూ నిర్వహించారు. మహిళల హక్కులు, వారి శక్తిసామర్థ్యాల గురించి వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో వేదికలు హోరెత్తాయి.

- వివరాలు 8లో..

కాటారంలో బాలిక కిడ్నాప్ కలకలం



సీసీ కెమెరా పుటేజీలో బాలికను తీసుకెళ్లిన కారు

ఇంటి వద్ద నుంచి కారులో తీసుకెళ్లిన యువకులు

కాటారం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో 17 ఏళ్ల బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. కారులో వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను ఇంటి వద్ద నుంచే వాహనంలో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు వెళ్లారు. కాటారం ఎస్సై అభినవ్, బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ వీధికి చెందిన బాలికను ఇద్దరు యువకులు శనివారం మధ్యాహ్నం ఆమె ఇంటి వద్ద నుంచి కారులో ఎక్కించుకుని తీసు కెళ్లారు. బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు ఇంటి సమీపంలో శుభకార్యం విషయమై మాట్లాడుతుండగా ఇద్దరు యువకుల్లో ఒకరు ఆమెను ఫో న్ చేసి బయటకు

మిగతా 8వ పేజీలో...

కేసుల్లో ఇరుక్కుంటే నిష్ప్రయోజనమే..

జిల్లా జడ్జి పి.నారాయణబాబు



కక్షిదారులకు రాజీ పత్రాన్ని అందిస్తున్న జిల్లా జడ్జి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేసుల్లో ఇరుక్కుంటే వ్యవప్రయాసలు తప్ప ఏ మాత్రం ప్రయోజనం ఉండదని జిల్లా జడ్జి పి.నారాయణబాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అధాలత్ కార్యక్రమం జరగ్గా వివిధ మండలాల నుంచి కక్షిదారులు రాజీపడ్డారు. వారందరికి రాజీ పత్రాలను అందించిన జడ్జి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు కక్షసాధింపు, ద్వేషభావాలను తగ్గించుకొని రాజీమార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పోలీస్‌స్టేషన్లు, కోర్టుల మెట్లు ఎక్కితే ఆర్థిక నష్టంతోపాటు మానసిక ప్రశాంతత లేకపోవడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రాంచందర్‌రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిలతో పాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో యువకుడి గల్లంతు

• ఆచూకీ కోసం గాలింపు



సలీంపాషా (ఫైల్)

ఎల్కతుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్లిన మానసిక వికలాంగుడైన యువకుడు శనివారం ఎస్సారెస్పీ ప్రధాన కాలువలోకి దిగి నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. స్థానిక ఎస్సై అక్కినపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ చోటేమియాకు నలుగురు కుమారులు కాగా, మూడో కుమారుడు మహ్మద్ సలీం పాషా(24) మానసిక వికలాంగుడు. నాగుల చెరువు కట్టపై వీరు రేకుల షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రధాన కాలువలోకి దిగడంతో కాలువలో పడి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అతడి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు సైతం కాలువ పొడవునా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువకుడి తండ్రి చోటేమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి

• మహబూబాబాద్ జిల్లాలో ఘటన



రాములు (ఫైల్)



శేఖర్ (ఫైల్)

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి కుమ్మరికుంట చెరువులో జరిగింది. ఎస్సై రమేష్ బాబు కథనం ప్రకారం... పెద్దతండాకు చెందిన భూక్య రాములు(45), అదే తండాకు చెందిన బాదావత్ భద్రు-బుజ్జి దంపతుల కుమారుడు శేఖర్(22) శుక్రవారం కుమ్మరికుంటలో చేపలు పట్టడానికి వెళ్లారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తండావాసులు కుంట వద్దకు వెళ్లి చూడగా కుంటలో ఇద్దరు శవమైన కనిపించారు. ఈత రాకపోవడంతో చేపలు పడుతున్న క్రమంలో నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు భూక్య రాములుకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మరో మృతుడు శేఖర్ తండ్రి బాదావత్ భద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు.

లక్నవరంలో హైకోర్టు చీఫ్ జస్టిస్



లక్నవరం సరస్సులో బోటింగ్ చేస్తున్న చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్

గోవిందరావుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్ శనివారం కుటుంబ సమేతంగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సును సందర్శించారు. సరస్సులోని మూడె ఐలాండ్‌లో రాత్రి బస చేశారు. కొద్దిసేపు బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. పస్రా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ముగ్గురిని మింగిన కెనాల్

- కాలువలోకి దూసుకెళ్లిన కారు
- కొడుకుతో సహా దూకిన తల్లి
- కారులోనే తండ్రి, కూతురు మృతి
- ఊపిరాడక కుమారుడి కన్నుమూత
- ప్రమాదం నుంచి బయటపడ్డ మహిళ
- పర్వతగిరి మండలం కొంకపాక శివారులో ప్రమాదం



ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఆర్యవర్ధన్ మృతదేహం



ప్రమాదం నుంచి బయటపడ్డ కృష్ణవేణి

పర్వతగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వరుసగా సెలవులు వస్తుండడంతో ఆనందంగా స్వగ్రామానికి బయలుదేరిన ఆకుటుంబం మృత్యుదాహానికి బలైంది. శని, ఆదివారం రెండురోజులు సెలవులు ఉన్నందున కారులో స్వగ్రామానికి బయలుదేరగా.. దారిలో ఉన్న కెనాల్ వారిని మింగింది. పర్వతగిరి మండలంలోని కొంకపాక గ్రామ శివారులో ఉన్న ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లోకి కారు దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదం శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామానికి చెందిన సోమారపు ప్రవీణ్‌కుమార్ ఎల్ఐసీలో ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య కృష్ణవేణి, కూతురు చైత్రసాయి, కుమారుడు ఆర్యవర్ధన్ ఉన్నారు. శని, ఆదివారాలు వరుసగా సెలవులు రావడంతో తల్లిదండ్రులను చూసేందుకు హనుమకొండ నుంచి స్వగ్రామమైన మేచరాజుపల్లికి టీఎస్03 ఎఫ్‌బీ 8881 నెంబరు గల రెడ్ కలర్ ఐ20 కారులో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామ శివారు దాటిన అనంతరం ప్రవీణ్‌కుమార్‌కు ఛాతిలో నొప్పి వస్తున్నట్లు ఉందని భార్య కృష్ణవేణితో అన్నాడు. అయితే భార్య వరంగల్ ఆస్పత్రికి వెళ్దామని చెప్పడంతో కారును వెనక్కి తిప్పాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకు వెళ్లింది. వెంటనే అప్రమత్తమైన కృష్ణవేణి తన ఒళ్లో కూర్చున్న కుమారుడు ఆర్యవర్ధన్‌ను బయటికి విసిరేసి బయటకు దూకేసింది. అప్పటికే కారుతో సహా నలుగురు కెనాల్‌లో పడిపోయారు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న కృష్ణవేణిని స్థానికులు తాడు సహాయంతో కాపాడారు. కొడుకు ఆర్యవర్ధన్ కొద్ది దూరం నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా స్థానికులు ఎదురుగా వెళ్లి అతడిని కాపాడేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే ఆర్యవర్ధన్(2) ప్రాణాలు కోల్పోయాడు. ప్రవీణ్‌కుమార్‌తో పాటు అతని కూతురు చైత్రసాయి(4) కారుతో సహా మునిగిపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మామునూరు ఏసీపీ తిరుపతి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మేచరాజుపల్లిలో విషాదఛాయలు

నెల్లికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్‌పాటు తన కూతురు చైత్ర, కుమారుడు ఆర్యవర్ధన్‌లు శనివారం పర్వతగిరి మండలం ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మేచరాజుపల్లి గ్రామానికి చెందిన సోమారపు సారంగపాణి చిన్న కుమారుడు ప్రవీణ్ హనుమకొండలోని రాంనగర్‌లో నివాసం ఉంటూ ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు రోజులు సెలవులు రావడంతో శనివారం హనుమకొండ నుంచి మేచరాజుపెల్లికి భార్య కృష్ణవేణి ఇద్దరు పిల్లలతో కారులో వస్తుండగా, ఈ ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం మేచరాజుపల్లి గ్రామస్థులను కలిచివేసింది. గ్రామస్థులు పర్వతగిరి ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు వెళ్లి ముగ్గురి మృతదేహలను చూసి కన్నీంటి పర్వంతమయ్యారు. భర్త, కుమారుడు, కూతురు మృతి చెందడంతో ఒంటరిగా మిగిలిన కృష్ణవేణి రోదనలను చూసి బంధువులు, స్నేహితులు బోరున విలపించారు.

ఐదు గంటల అనంతరం మృతదేహాల వెలికితీత

ఎస్ఆర్ఎస్పీ కాలువలోకి పడిపోయిన కారును వెలికితీసేందుకు కష్టతరంగా మారింది. కారులో తండ్రి, కూతుర్లుండగా కారు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఎక్కడ ఉందో స్థానికులు గుర్తించలేకపోయారు. దీంతో నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడిన పోలీసులు.. అటు వైపుగా నీటి ప్రవాహం వెళ్లకుండా గేట్లు మూసివేయించారు. ప్రవాహం తగ్గడంతో సుమారు 200 మీటర్ల దూరంలో పోలీసులు కారును గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహాయంతో జేసీబీ, క్రేన్‌లతో బయటకు తీశారు. అందులో ఉన్న ప్రవీణ్ కుమార్, చైత్రసాయి మృతదేహాలను వెలికితీశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ముగ్గురి మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదన

కారు ప్రమాదంలో మృతి చెందిన తమ కుటుంబసభ్యులను చూసి వారి కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. అనూహ్యంగా జరిగిన ఈ ప్రమాదంలో ముక్కుపచ్చలారని పిల్లలతో పాటు కుటుంబాన్ని పోషించే తండ్రి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా ఏడ్చిన పరిస్థితిని చూసి చూపరులు కన్నీరుపెట్టారు.

గతంలోనూ నలుగురు మృతి

నాలుగేళ్ల కిందట ఇదే చోట రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అదీ కూడా కారు ప్రమాదమే కావడం చర్చనీయాశమైంది. ఇప్పుడు ముగ్గురి ప్రాణాలు తీసుకుంది. అయితే ఇక్కడ ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు గానీ పెట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అలసత్వం వీడి ఇక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూలీల వాహనం బోల్తా.. 16 మందికి గాయాలు

ఏటూరునాగారం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో 16 మంది వలస కూలీలకు గాయాలైన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో శనివారం చోటుచేసుకుంది. రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ మిర్చి రైతు వద్ద పనిచేయడానికి నెల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్ ఏరియా ముత్యంపాల్ గ్రామానికి చెందిన మొత్తం 16 మంది కూలీలు వచ్చారు. మంగపేట మండలం కమలాపురం శివారులోని ఓ ఖాళీ స్థలంలో వారు తాత్కాలికంగా నివసిస్తున్నారు. ప్రతిరోజూ రామన్నగూడెం శివారులోని మిరప చేనులో మిర్చికోతకు వెళ్లి తిరిగి గుడారానికి చేరుకున్నారు. ఈక్రమంలో శనివారం ఉదయం వాహనంలో 16 మంది కూలీలు మిర్చి కోతకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి తమ స్థావరానికి వెళ్తుండగా రాంనగర్ శివారులో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కూలీలందరికీ గాయాలు కాగా వారిని స్థానికులు మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. 16 మందిలో నలుగురు కూలీలు మచూకి బాల్‌సింగ్, మడవి చిర్ర, మచూకి ఐతు, మచూకి పారుకు తీవ్ర గాయాలు కావడంతో వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా 12మంది స్థానిక సామాజిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే సీఎం సభ

- రూ.800 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎం మనసు చూరగొనేలా ఏర్పాట్లు చేయాలి..
- 40వేల మందితో బహిరంగ సభ సక్సెస్‌కు యత్నాలు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సీఎం సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం సభ స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలోని పాలకుర్తి రోడ్డులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన స్థలాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌లతో కలిసి శనివారం పరిశీలించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని, రూ.8.6కోట్లతో నిర్మించనున్న జనరల్ డిగ్రీ కళాశాల నిర్మాణానికి గాను సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఖాళీగా ఉన్న ఐదెకరాల స్థలాన్ని పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజినల్ కాంప్లెక్స్ నిర్మాణానికి డిస్మెంటల్ చేస్తున్న ఎంపీడీవో కార్యాలయంను పరిశీలించారు. సీఎం సభ నిర్వహణకు శివునిపల్లి శివారులోని ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డులో 30 ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కడియం మాట్లాడుతూ డీసీపీ రాజమహేంద్ర నాయక్, కలెక్టర్ సూచన మేరకు సభాస్థలం ఖరారు చేసినట్టు వెల్లడించారు. 16న సీఎం ఘన్‌పూర్‌లో పర్యటించి రూ.800కోట్లతో 14 శాఖలకు సంబంధించిన 24 అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు.

ఈ సభకు 40వేల మందిని సమీకరించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సభను విజయవంతం చేయాలని కోరారు. ఇన్నోవేట్‌గా, సంథింగ్ స్పెషల్‌గా, సీఎంను చూరగొనేలా, తనకు పొలిటికల్ మైలేజీ వచ్చేలా సభ నిర్వహణ ఏర్పాట్లు ఉండాలన్నారు. సీఎం మెచ్చుకుంటే ఘన్‌పూర్‌కు, జిల్లాకు మరిన్ని నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. సభకు వచ్చేవారికి ఇబ్బందులు రాకుండాపోలీస్‌శాఖ పనితీరు ఉండాలన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీవోలు ధరంసోత్ వెంకన్న, గోపి, డీపీవో నాగపూరి స్వరూప, ఏసీపీ భీమాశర్మ, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ రాంబాబు, గణేష్, ఏడీఈ రణధీర్ రెడ్డి, కమిషనర్ రవీందర్‌గౌడ్, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, గన్ను నర్సింహులు, అంబటి కిషన్ రాజ్, గుజ్జరి రాజు, బూర్ల శంకర్, కొంతం శ్రీనివాస్, రాజేష్‌నాయక్, పోలెపల్లి రంజిత్ రెడ్డి, రామకృష్ణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

గోల్డ్ లోన్ కావాలా.. ఏటీఎంలో తీసుకోండి

• ఇండియాలోనే మొదటి ఏటీఎం వరంగల్‌లో ప్రారంభం



గోల్డ్ లోన్ ఏటీఎంను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

వరంగల్ చౌరస్తా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గోల్డ్ లోన్ కావాలంటే వెంటనే అందించే ఏటీఎం అందుబాటులోకి వచ్చింది. అది కూడా 10 నుంచి 12 నిమిషాలలోపే రుణం అందిస్తుంది. వరంగల్ ఎంజీ రోడ్డులో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దీన్ని శుక్రవారం ప్రారంభించారు. దేశంలోనే ఇది మొట్టమొదటి గోల్డ్ లోన్ ఏటీఎం అని అధికారులు తెలిపారు. ఇండియాలోనే తొలిసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో ఈ ఏటీఎం సెంటర్‌ను ప్రారంభించారు. ఏ-1 టెక్నాలజీగా పనిచేసే ఈ ఏటీఎం మనుషుల లాగానే పనిచేస్తుంది. ఏటీఎం దగ్గరకువెళ్లి మనం తనఖాపెట్టాలి అనుకున్న బంగారు నగలను మిషన్‌లోని బాక్స్‌లో వేయగానే ఏటీఎం వెంటనే మనిషిలా ఆ నగలను చూస్తుంది. ఓకే అనే సమాధానం వస్తుంది. లోన్ ఇవ్వడానికి 10 నుంచి 12 నిమిషాల సమయంలో ప్రాసెస్‌ను పూర్తి చేస్తుంది. నగలు బాక్స్‌లో వేశాక ఆధార్‌కార్డు నంబర్, మొబైల్ నంబర్ అడుగుతుంది. లోన్ ఇచ్చే ముందు నగలను బరువు ఎంత అని చూసి కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో ధరలను పరిశీలించి లెక్కవేసి లోన్‌లో 10శాతం మాత్రమే నగదు ఇచ్చి 90శాతం డబ్బును రుణం తీసుకునే వినియోగదారుడి అకౌంట్‌లో జమ చేస్తుంది. గోల్డ్ లోన్ తీసుకోవాల్సిన వ్యక్తి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ కలిగి ఉండాలి. ఏటీఎం ద్వారా బ్యాంకు ఉద్యోగులకు కూడా పని తగ్గుతుంది. ఇలాంటి ఏటీఎంలు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో భాగంగా మొదటి సారిగా వరంగల్‌లో ఏర్పాటు చేశారు.

గూడూరు అభయారణ్యంలో అడవి దున్నల సంచారం

గూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గూడూరు అటవీ శాఖ డివిజన్ పరిధిలో గూడూరు, కొత్తగూడ, గంగారం రేంజ్‌లు ఉన్నాయి. ఈ మూడు రేంజ్‌ల పరిధిలో 96వేల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. అడవి దున్నలు అటవీ ప్రాంతంలో గుంపులు.. గుంపులుగా సంచరిస్తున్నాయి. విస్తారమైన గడ్డి క్షేత్రాలు, రకరకాల వృక్షాలు ఉండడంతో వివిధ రకాల శాఖాహార జంతువులతో పాటు అడవి దున్నలు అధికమయ్యాయి. వాటి కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. భారీ శరీరంతో మందలుగా సంచరించే అడవి దున్నలు సింహాలను సైతం తరిమికొట్టగల సామర్థ్యం ఉంటుంది. ఇండియన్ బైసన్‌గా గుర్తింపు పొందిన ఇవి.. ఏడు అడుగుల ఎత్తు, పది అడుగుల పొడవైన భారీ శరీరంతో ఒక్కొక్కటి 800 నుంచి 1000 కిలోల వరకు బరువు ఉంటాయి. రెండు నుంచి 20 వరకు మందలుగా ఏర్పడి సంచరిస్తున్నాయి. గూడూరు అటవీశాఖ డివిజన్ పరిధిలోని మూడు రేంజ్‌ల్లో సుమారు వందకుపైగా అడవి దున్నలున్నట్లు గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్ తెలిపారు.



గూడూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అడవి దున్నలు



వేదికపై వందేమాతరం గీతం ఆలపిస్తున్న న్యాయమూర్తులు, కలెక్టర్లు, ఎస్పీలు

కమ్యూనిటీ మీడియేటర్స్‌తో సత్వర న్యాయం

- రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్
- కాళోజీ కళాక్షేత్రంలో వలంటీర్ల అవగాహన సదస్సు
- హాజరైన జడ్జిలు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు

వరంగల్ లీగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వ్యవస్థీకృతంగా ఉన్న పలు వివాదాలను పరిష్కరించడంలో సామాజిక వర్గ (కమ్యూనిటీ మీడియేటర్స్) పాత్ర ప్రముఖమైనదని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్స్ వలంటీర్ల అవగాహన సదస్సుకు జస్టిస్ సుజయ్‌పాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా కుటుంబ తగాదాలు, వివాహానికి సంబంధించిన వివాదాలు, సమాజ మూలాల్లో సమాధానం దొరుకుతుందన్నారు. ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులకు సమస్యలపై అవగాహన ఉండడం వల్ల పరిష్కారం సులభతరమవుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో మధ్యప్రదేశ్, కేరళలో కమ్యూనిటీ మీడియేటర్స్ విధానాన్ని ప్రవేశపెట్టి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నట్లు జస్టిస్ తెలిపారు. ఆ రాష్ట్రాల నుంచి ప్రేరణగా తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోనూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. ఆరంభంలోనే ఆయా సామాజిక వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించిందని జస్టిస్ సుజయ్‌పాల్ పేర్కొన్నారు. కమ్యూనిటీ మీడియేటర్స్ వల్ల సమయం, డబ్బు వృథా కాకుండా పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా సులువుగా ఫలితాలను పొందవచ్చని అన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జస్టిస్ సుజయ్‌పాల్ తన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర హైకోర్టు జడ్జి, మీడియేషన్, ఆర్బిటేషన్ సెంటర్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. సమాజంలో వివిధ సమస్యలపై అవగాహన కలిగిన సామాజికవర్గ పెద్దలు కమ్యూనిటీ మీడియేటర్స్ వలంటీర్లుగా ఉండడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో వివిధ చట్టాలు పెరగడం వలన కోర్టు కేసులు కూడా పెరుగుతున్నాయని, వీటిని అదుపు చేయడానికి కమ్యూనిటీ మీడియేటర్స్ సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 5,30,96,993 పెండింగ్ కేసులు ఉన్నాయని, వాటిలో 1,54,60,199 సివిల్ కేసులు, 3,76,36,794 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే తెలంగాణలో 9,45,370 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 3,35,012 సివిల్, 6,10,353 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. న్యాయసేవా సంస్థ, లోక్ అదాలత్‌లు పలు రకాల విధానాల ద్వారా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించినా పెండింగ్ కేసులు పెరుగుతున్నాయని జస్టిస్ లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసుల పెండెన్సీ తగ్గించడంలో భాగంగా కమ్యూనిటీ మీడియేటర్స్ విధానం దోహదం చేస్తుందని ఆయన సూచించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ మౌసమి భట్టాచార్య మాట్లాడుతూ.. కమ్యూనిటీ మీడియేటర్స్ విధానాన్ని అమలు పరుద్దామని నిర్ణయం తీసుకున్న వెంటనే హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు వరంగల్ ఉమ్మడి జిల్లా యంత్రాంగమంతా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు సహకరించడం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇదే విధంగా సహకరించాలని కోరారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సీహెచ్. పంచాక్షరి మాట్లాడుతూ.. కమ్యూనిటీ మీడియేటర్స్ విధానం వల్ల పలు రకాల తక్షణ లాభాలు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం తగ్గుతుందన్నారు. కోర్టుల్లో తీర్పు ఒకరివైపు వస్తుందని, కానీ కమ్యూనిటీ మీడియేటర్స్ విధానంలో రాజీ మార్గం ద్వారా ఇద్దరికీ సంతృప్తికరమైన విజయం చేకూరుతుందని తెలిపారు. అదే విధంగా తెలిసిన భాషలో వివాదం అర్థమవుతుందన్నారు. కమ్యూనిటీ మీడియేటర్స్ ఇచ్చిన నిర్ణయాన్ని లీగల్ సర్వీస్ అథారిటీలో అవార్డు రూపంలో పొందవచ్చని, ఇది కోర్టులు ఇచ్చిన డిగ్రీతో సమానమని జడ్జి పంచాక్షరి పేర్కొన్నారు. కమ్యూనిటీ మీడియేటర్లుగా నియామకం పొందినవారు మూడు రోజులు 20గంటల శిక్షణ విధిగా తీసుకోవాలని, తద్వారా సమస్యలను సమస్యలను పరిష్కరించడంలో నైపుణ్యత వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు సీహెచ్. రమేష్‌బాబు, నిర్మల గీతాంబ, ఇతర న్యాయమూర్తులు, ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు ప్రేమలత, అపర్ణ, మనిషా శ్రవన్ ఉన్నమ్, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా, వరంగల్, హనుమకొండ, ములుగు, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, పి.ప్రావీణ్య, డాక్టర్ దివాకర్, రిజ్వానా భాషా షేక్, అద్వైత్ కుమార్‌సింగ్, రాహుల్ శర్మ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, ఎస్పీలు సుధీర్ రాంనాథ్, కేకన్ కిరణ్‌ఖారే, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, ఎం. రమేష్‌బాబు, బార్ కౌన్సిల్ మెంబర్ సిరికొండ సంజీవరావు, వివిధ కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జీలు నిర్మల గీతాంబ, కె.లక్ష్మణ్, రమేష్‌బాబు


వర్చువల్‌లో మాట్లాడుతున్న జడ్జి జస్టిస్ మౌసమి భట్టాచార్య

కేసుల పరిష్కారంలో సహకరించాలి

- మొదటి జాతీయ లోక్ అదాలత్‌లో జస్టిస్ సుజయ్‌పాల్
- విడిపోయి జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలో ఒక్కటైన జంట


బాధితుడికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరంగల్ లీగల్ (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ కోరారు. రాజీమార్గం ద్వారా ఇరుపక్షాలు అంగీకారంతో పరిష్కరించుకునే ఏకైక మార్గం లోక్‌అదాలత్ అని ఆయన పేర్కొన్నారు. ఈ యేడు నిర్వహించ దల్చిన నాలుగు లోక్ అదాలత్‌లో శనివారం మొదటి లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కుటుంబ తగాదా కేసులో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొని భార్యాభర్తలు సరస్వతి - అరుణ్‌కుమార్‌లు జస్టిస్ సుజయ్‌పాల్ సమక్షంలో ఒక్కటయ్యారు. అలాగే మోటారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి రూ.40 లక్షలకు నష్ట పరిహారం కోసం కోర్టులో కేసు వేశాడు. ఇన్సురెన్స్ కంపెనీతో రాజీ మార్గం ద్వారా ఒప్పందం చేసుకొని రూ.18 లక్షల నష్టపరిహారానికి ఒప్పుకోవడంతో సంబంధిత చెక్కును జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ లక్ష్మణ్ చేతుల మీదుగా బాధితుడికి ఈ కార్యక్రమంలో అందజేశారు.


సీజే సమక్షంలో దండలు మార్చుకుంటున్న విడిపోయి ఒక్కటైన జంట

చక్ దే ఇండియా..

- నేడు చాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్
- నగరంలో క్రికెట్ ఫీవర్.. ట్రోఫీ మనదే అంటున్న అభిమానులు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దుబాయి వేదికగా ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ - 2025 ఫైనల్ పోరు ఆదివారం జరగనుంది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడం.. ప్రభుత్వ, ప్రైయివేట్ ఉద్యోగ, విద్యాసంస్థలకు సెలవు రావడంతో క్రికెట్ అభిమానులు, యువత టీమిండియా - కివీస్ జట్ల మధ్య జరగబోయే మ్యాచ్‌ని తిలకించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పలు తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరుగుతన్నప్పటికీ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుండంతో మ్యాచ్‌ను ఇంటి వద్ద టీవీల్లో చూసేందుకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ట్రోఫీ ప్రారంభం నుంచి మంచి ఫామ్‌లో ఉన్న టీమిండియా ఫైనల్‌లో గెలవాలని విద్యార్థులు, యువత కోరుకుంటోంది. ఈ క్రమంలో నగరంలో క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. అభిమానుల ఆకాంక్షల మేరకు నగరంలో ప్రముఖ హోటల్స్, పెద్ద పెద్ద బార్లలో ఇప్పటికే ఫైనల్ మ్యాచ్‌లు తిలకించే వీలుగా భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రొజెక్టర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ట్రోఫీ తప్పకుండా సాధిస్తాం..



చాగంటి శ్రీనివాస్, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి

చాంపియన్స్ ట్రోఫీ లీగ్‌లో భాగంగా టీమిండియా ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సెమీస్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో రోహిత్‌శర్మ సేన ధాటికి కంగారూలు బెంబేలెత్తిపోయారు. 2023 వరల్డ్‌కప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నారు. ఇప్పుడు ఫైనల్‌లో కూడా టీమిండియా గెలిచి ట్రోఫీ సాధిస్తుంది.

మిడిల్ ఆర్డర్ పటిష్టంగా ఉంది..



ఎం.డి. అఫ్జల్, డీఎస్ఏ కోచ్ హనుమకొండ

టీమిండియా జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాట్‌మెన్లు చాలా పటిష్టంగా ఉన్నారు. శ్రేయాస్, కేఎల్ రాహుల్‌లు చెలరేగి ఆడటం, స్టార్ బ్యాట్‌మెన్ విరాట్‌కోహ్లీ పరుగులు వరద, శుబ్‌మన్‌గిల్, కెప్టెన్ రోహిత్‌శర్మ అత్యుత్తమ ఓపెనింగ్ ప్రతిభతో నిలదొక్కుకోవడం భారత్‌కు కలిసివచ్చే అంశాలు. కివీస్‌పై సులువుగా విజయం సాధించి ట్రోఫీ సాధించి తీరుతారు.

న్యూజిల్యాండ్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాల్సిందే..



గతేడాది జరిగిన టెస్ట్ చాంపియన్‌షిప్ ట్రోఫీలో భారత్‌పై న్యూజిలాండ్ జట్టు గెలిచి ట్రోఫీ నుంచి వైదొలిగేలా చేసింది. ఈ ఫైనల్‌లో విజయం సాధించి ఆ జట్టుకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాల్సిందే. ఇప్పటికే కివీస్‌పై లీగ్‌లో విజయం సాధించిన రోహిత్ సేన.. మరింత అప్రమత్తంతో ఫీల్డింగ్, బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించి విజయం సాధించాలి.

తోట సుకాంత్, రంజీ ట్రోఫీ క్రీడాకారుడు, హనుమకొండ

చేయి చేయి కలిపి.. అలుమ్నీ నెలకొల్పి..

- రాజనీతిశాస్త్ర పూర్వ విద్యార్థుల కృషి
- కేయూలో సెమినార్ హాల్ ఏర్పాటు



కేయూలో ఏర్పాటు చేసిన అలుమ్నీ హాల్

కేయూ క్యాంపస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వారంతా ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. వర్సిటీ క్యాంపస్‌లో కలిశారు. అనుకున్నదే తడవుగా తాము చదువుకున్న రాజనీతిశాస్త్ర విభాగానికి ఏదైనా చేయాలనుకున్నారు.. తమ విభాగం పూర్వ విద్యార్థుల నేతృత్వంలో అలుమ్నీ హాల్‌ను ఏర్పాటు చేద్దామని నిర్ణయించుకున్నారు. డిపార్టుమెంట్ పూర్వ ప్రొఫెసర్లు, పనిచేస్తున్న అధ్యాపకులందరూ గతేడాది అగస్టు 27 వర్సిటీ క్యాంపస్‌లోని రాజనీతి శాస్త్ర విభాగంలో అలుమ్నీ సమావేశం నిర్వహించారు. తమ చదువులమ్మ బడికి శాశ్వతంగా సెమినార్ హాల్ నిర్మిద్దామని సిద్ధమయ్యారు. రాజనీతిశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థులు, రిటైర్డు ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్‌తో పాటు విద్యార్థులంతా తమ వంతుగా ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకటించారు. రాజ నీతిశాస్త్ర విభాగం అలుమ్నీ విద్యార్థుల వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రూపులో ఎప్పటికప్పుడు వివరాలు పొందుపరుస్తూ విరాళాల సేకరణ చేపట్టారు. రిటైర్డు ప్రొఫెసర్ రఘురాంరెడ్డి తనవంతుగా మెట్టమొదట విభా గానికి నిధులను ప్రకటించారు. అలాగే అలుమ్నీ సమావే శంలో రిటైర్డు ప్రొఫెసర్లు, ప్రస్తుత డిపార్టుమెంట్ విభాగం అధ్యాపకులు తమకు తోచినంత సహాయం చేశారు. రూ.5వేల నుంచి రూ.50వేల వరకు ఒక్కొక్కరూ తమ శాయశక్తులా నిధులను సమకూర్చారు.

అధునాతన వసతులు.. ఆహ్లాదకరమైన హాలు

రాజనీతిశాస్త్ర విభాగం విద్యార్థులు, స్కాలర్లు, పీహెచ్‌డీ వైవాలు, ఇతర సదస్సులు నిర్వహించాలంటే ఇతర విభాగాల సెమినార్ హాల్‌ను అడగాల్సిన పరిస్థితి ఉండేది. విద్యార్థుల వెల్‌కం, ఫేర్‌వెల్ పార్టీలకు సైతం ఇబ్బందులు తలెత్తేవి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రాజనీతిశాస్త్ర విభాగంలోనే ఓ గదిని అధునాతనంగా తీర్చిదిద్దుకుని సెమినార్ హాల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 100 మంది విద్యార్థులు దర్జాగా కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, రెండు ఏసీలు, సౌండ్ సిస్టం, వైర్‌లెస్ మైక్‌లు, అతిథులు కూర్చునే విధంగా మంచి స్టేజీ, పుట్టీతో సుందరంగా అలంకరించిన గోడలతో అలుమ్నీ సెమినార్ హాల్‌ను అద్భుతంగా, అహ్లాదకరంగా నిర్మించారు. అలాగే మంచి పోడియం, కుర్చీలు, కిటికీలు, టీపాయ్‌లు, కర్టన్‌లను ఏర్పాటు చేశారు. చెయ్యి చెయ్యి కలిపి అలుమ్నీ హాల్‌ను ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ వైవాలు.. ఆఫ్‌లైన్ సెమినార్లు

దేశవ్యాప్తంగా అధునిక సాంకేతిక విజ్ఞానం పరుగులు పెడుతున్న క్రమంలో పీహెచ్‌డీ వైవాలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఆఫ్‌లైన్ సెమినార్లు నిర్వహిస్తున్నారు. వీటిని అందిపుచ్చుకుని విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు సెమినార్ హాల్‌లో ప్రొజెక్టర్, సీసీ టీవీలుతో పాటు వైవాలో సులభంగా మాట్లాడే విధంగా.., సమాధానాలు చెప్పేందుకు సౌండ్ సిస్టంను ఏర్పాటు చేశారు. ఇటీవల రాజనీతిశాస్త్ర విభాగంలో రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించారు. అలాగే వర్క్‌షాప్ నిర్వహించారు.

మరింత ముందుకు..

కేయూ క్యాంపస్‌లో అలుమ్నీ హాల్‌తో మొదటి అడుగువేసి రాజనీతిశాస్త్ర విభాగం రానున్నరోజుల్లో విభాగం విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనుంది. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం క్యాంపస్‌లో 100 మందికి సీట్లున్నాయి. ఇప్పుడు మొదటి ఏడాదిలో 42 మంది, రెండో ఏడాదిలో మరో 31 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

నేడు ప్రారంభం

కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం అలుమ్నీ హాల్‌ను మార్చి 9న ఆదివారం ప్రారంభిస్తారు. దీనికి ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, విశిష్ట అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హాజరవుతారు. పూర్వ విద్యార్థులందరూ రావాలని ఇప్పటికే ఆహ్వానాలు పంపారు.

సమష్టిగా అలుమ్నీ హాల్ ఏర్పాటు చేశాం..

ఎస్ వెంకట్, కేయూ రాజనీతిశాస్త్రం విభాగాధిపతి

కేయూ రాజనీతిశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థులు, రిటైర్డు ప్రొఫెసర్లు, ఇప్పటి అధ్యాపకులందరి సహకారంతో అలుమ్నీ హాల్‌ను ఏర్పాటు చేశాం. వర్సిటీలో ఇతర విభాగాలన్నింటికీ మార్గదర్శకంగా నిలవాలని నిర్ణయించుకున్నాం. విభాగంలోని బీవోఎస్ డాక్టర్ కృష్ణయ్య, వోడపల్లి నాగరాజు, సత్యనారాయణలతోపాటు సుబేదారిలోని పీజీ, మహిళా కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకులందరూ కృషి చేశారు.

రింగ్‌రోడ్డు చుట్టూ రైలు

- వరంగల్ ఓఆర్ఆర్ 69 కి.మీ.ల మేర రైల్వే ట్రాక్
- ఆర్ఆర్‌తో పాటు రైల్వే లైన్‌తో మారిపోనున్న వరంగల్ రూపురేఖలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు అభివృద్ధి పట్టాలెక్కనుంది. ఇప్పటికే వరంగల్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ రావటంతో వరంగల్ ప్రజలు ఆనందంలో ఉన్నారు. తాజాగా రెండో రాజధానిగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరం చుట్టూ రైలు కూత పెట్టేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ కుమార్ వైష్ణవ్ హామీ ఇవ్వటంతో ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో వరంగల్ నగరం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఏర్పడనున్నాయి. ఇక దక్షిణ భారతదేశానికి గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీ రాగా, రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే ఒత్తిడి కేంద్రం పెరుగుతోంది. వీటితోపాటు డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి భద్రాచలం, మిర్యాలగూడ, గద్వాల్ రైల్వే లైన్లు నిర్మాణం జరుగుతుండటంతో ఓరుగల్లుకు రైల్వే కనెక్టివిటీ మరింతా పెరుగనుంది.

రింగ్ రోడ్డు చుట్టూ రైల్వే కూత

హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శనివారం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ కుమార్ వైష్ణవ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్, భువనగిరి ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. ప్రధానంగా హసన్‌పర్తి - నష్కల్ మధ్య రైల్వే నిర్మాణంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతులకు నష్టం వాటిల్లకుండా రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని వరంగల్ ఎంపీ కావ్య రైల్వే మంత్రిని కోరారు. దీనికి ప్రత్యామ్నాయంగా వరంగల్ రింగ్‌రోడ్డు వెంట లైన్ నిర్మించాలని కోరారు. అయితే ఈ లైన్ వరకే కాకుండా, మొత్తం 69 కి.మీ.ల మేర ఆర్ఆర్ మొత్తం రైల్వే లైన్ నిర్మాణం చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. వరంగల్ ఆర్ఆర్ 69 కిలో మీటర్లు ఉండగా, అందులో 28కి.మీలు కరుణాపురం, రాంపూర్, ధర్మసాగర్, ఉనికిచర్ల, దేవన్నపేట, కోమటిపల్లి, భీమారం, చింతగట్టు, పలివేల్పుల, ముచ్చర్ల, పెగడపల్లి, వంగపహాడ్, ఆరెపల్లి వరకు జాతీయ రహదారితో కలిసి ఈ రింగ్‌రోడ్డు ఉంది. ఇక మిగిలిన 41 కిలో మీటర్లు ఆరెపల్లి నుంచి రాంపూర్ వరకు నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం భూసేకరణకు ప్రభుత్వం గత నవంబరు నెలలో రూ.107కోట్లు విడుదల చేసింది. మొదటి దశలో 20కి.మీలు, రెండో దశలో 11కి.మీలు, మూడో దశలో 10కి.మీల చొప్పున నిర్మించనున్నారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి కాగా, పనులు కూడా ప్రారంభించారు. ఈ ఏడాది చివరినాటికి రింగ్‌రోడ్డు పనులు పూర్తి చేస్తే వచ్చే 2026 బడ్జెట్‌లో వరంగల్ ఆర్ఆర్ చుట్టూ రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు ఇచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్ఆర్ చుట్టూ రైల్వేలైన్ వేస్తే నగరం చుట్టూ 10 కిలో మీటర్లకు పైగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని, అలాగే నగరం అవతలి వైపు కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు అవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌కు ఇప్పటికే ఎయిర్‌పోర్టు మంజూరు కావటంతో వాటి పనులు మొదలయ్యాయి. రెండున్నరేళ్లలో వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేసి, గగనయానం చేసే అవకాశం కల్పిస్తామని కేంద్ర విమానాయశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇటీవల ప్రకటించారు. విమానాశ్రాయంతో టెక్స్‌టైల్ పార్కులో కొత్త పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర, బొగత, ఏటూరునాగారం అభయారణ్యం, వరంగల్ కోట, భద్రకాళి, వేయి స్తంభాల ఆలయాలకు స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతోపాటు రింగ్‌రోడ్డు చుట్టూ రైల్వేలైన్‌తో చిన్నచిన్న పరిశ్రమలకు అవకాశాలు మెరుగుపడుతాయని అంచనాలు ఉన్నాయి. ఈ రైల్వేలైన్‌తో చింతలపల్లి వద్ద ఉన్న టెక్స్‌టైల్ పార్కులో భారీ పెట్టుబడులకు, ఉపాధి అవకాశాలకు ప్రయోజకరంగా ఉంటుందనే చర్చ జరుగుతోంది.


కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతున్న ఎంపీ కావ్య, మంత్రులు సీతక్క, వెంకట్‌రెడ్డి, సురేఖ

కాజీపేట రైల్వే డివిజన్‌పై ఒత్తిడి

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుపై మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడుతున్న సౌత్‌కోస్ట్ రైల్వే ఏర్పడుతుండటంతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్యరైల్వే జోన్‌లో కేవలం హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ రైల్వే డివిజన్‌లే మిగులుతున్నాయని రైల్వే మంత్రికి తెలిపారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ అభివృద్ధిలో కాజీపేట రైల్వే డివిజన్ కీలక పాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. ప్రయాణికులకు, గూడ్స్‌కు సమర్థవంతమైన రైల్వే నెట్‌వర్క్, ఆపరేషన్స్ మెయింటెనెన్స్ చేసేందుకు కాజీపేటలో రైల్వే డివిజన్ అవశ్యకతపైన, అత్యధిక ప్రయాణికుల ట్రాఫిక్‌తో పాటు సరుకులు రవాణా చేస్తున్న కాజీపేటను డివిజన్ చేసే.. హైదరాబాద్, గుంటూరు డివిజన్‌లకంటే అధిక ఆదాయం వస్తుందని కేంద్ర మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ఇక కాజీపేటలో నిర్మిస్తున్న కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగంగా చేపట్టాలని రైల్వే మంత్రిని కోరారు.

డోర్నకల్ టు మిర్యాలగూడ, భద్రాచలం

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ ఉన్నా వంతెనలపై నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో రైళ్ల రాకపోకలు లేవు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ఓరుగల్లు మంత్రులు, ఎంపీలు తీసుకెళ్లారు. అలాగే డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు 97కిలో మీటర్ల లైన్ నిర్మించాల్సి ఉంది. అలాగే డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు కూడా రైల్వే పనులు వేగవంతం చేయాలని కోరారు. వీటితో పాటు జనగామ జిల్లా పెంబర్తి వద్ద కాజీపేట- సికింద్రాబాద్ సెక్షన్‌లో ఎల్‌సీ నెం.40వద్ద, పెంబర్తి-కొన్నే రోడ్డులోని 0/8-10 కి.మీ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)లు ఏర్పాటు చేయాలని కోరారు. మొత్తానికి మంత్రులు, ఎంపీల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి సానుకూలంగా స్పందించటంతో ఓరుగల్లు అభివృద్ధి పట్టాలెక్కుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మెట్రో రైలు పట్టాలెక్కేదెప్పుడో..?!


వరంగల్ నగర ప్రజల చిరకాల అకాంక్ష నియో మెట్రో రైలుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు, ఎయిర్ పోర్టు, ఆర్ఆర్ చుట్టూ రైల్ లైన్లు.. ఇలా ఓరుగల్లు అభివృద్ధికి కావాల్సిన పనులు జరుగుతున్నాయి. అయితే నగరవాసులకు అత్యవసరమైన నియో మెట్రో రైలుపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడం లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని 2019లో నియోమెట్రో రైలు కోసం ప్రతిపాదనలు చేశారు. ట్రైసిటీని అనుసంధానిస్తూ కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కి.మీ.ల దూరంలో 7.1కి.మీ. రోడ్డు మార్గంలో, 8.4కి.మీలు ఆకాశ మార్గంలో రైల్వే ట్రాక్ నిర్మించాలని, ఇందుకు రూ.1,341కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. లైట్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎల్ఆర్‌టీ ఎస్) ద్వారా ఒకే దశలో ప్రాజెక్టు పూర్తి చేయాలని డీపీఆర్ రూపొందించారు. కానీ, గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సాయం కోరుతూ లేఖ రాసి చేతులు దులుపుకుందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం నుంచి ఎయిర్‌పోర్టు, రైళ్లు, రోడ్లు, అండర్ డ్రైనేజీ తదితర వాటిపై ఒత్తిడి తెస్తున్నా వరంగల్ నగరవాసులకు అత్యవసరంగా, వరంగల్ నగరాన్ని మెట్రో సిటీగా మార్చే నియో మెట్రో రైల్‌పై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వరంగల్ నగరంలో నియో మెట్రో రైల్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డివిజన్ కోసం సీఎంతో కలిసి రైల్వే మంత్రిని కలుస్తాం..

డాక్టర్ కడియం కావ్య, వరంగల్ ఎంపీ



కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కోరాం. కాజీపేటకు ఉన్న అర్హతలు, రెండో రాజధానిగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లోని కాజీపేటను అప్‌గ్రేడ్ చేయటం వల్ల జరిగే లాభాలను వివరించాం. మరోసారి ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రైల్వే మంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తాం. కాజీపేటను డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేసేవరకు కేంద్రంపై ఒత్తిడి తెస్తాం. వరంగల్ ఆర్ఆర్ చుట్టూ రైల్వేలైన్‌కు కేంద్ర మంత్రి సానుకూలంగా ఉన్నారు.



ఘనంగా మహిళా దినోత్సవం



భూపాలపల్లిలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల



ములుగులో మహిళా కార్మికురాను సన్మానిస్తున్న రవిచందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ములుగులోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.హేమలత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి గ్యాదరి రమాదేవి హాజరయ్యారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరుప సతీష్‌కుమార్, ఏళ్ల మధుసూదన్, సమన్వయకర్త అర్.జయశ్రీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి పోరిక శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మూడ్ కసన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో జరిగిన విజ్ఞాన సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ మాట్లాడారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, సఖి సెంటర్ సీఏ లావణ్య, కౌన్సిలర్ కల్పన, లీగల్ కౌన్సిలర్ ప్రణయ్‌ప్రసాద్, కేస్ వర్కర్ మౌనిక, పారా మెడికల్ సిబ్బంది రాధ, చైల్డ్‌లైన్ కౌన్సిలర్లు రజిని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు. ములుగులోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సన్మానించి దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకుడు లక్కీ, మహిళా నాయకురాలు గుంటోజు పావని, పంచాయతీ కార్యదర్శి రఘు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

• భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇల్లందుక్లబ్ హౌజ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అఖిల్ హాజరయ్యారు. సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ పద్మజ, సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి అధికాంలు మారుతి, క్రాంతికుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన భవనంలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య హాజరయ్యారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు. ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝైపతి వీణారాణి, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. దీనికి ముందు భారీ ర్యాలీని నిర్వహించారు. తుడుందెబ్బ జాతీయ కో-కన్వీనర్ యాసం రాజు, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముర్రం శంకరమ్మ, తల్లాండి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ నాగలక్ష్మి, కృష్ణవేణిని బీఆర్ఎస్ నేతలు ఖాజా పాషా, మల్లారెడ్డి, నర్సయ్య సన్మానించారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి దంపతులు, ఎస్సై అభినవ్ దంపతులు వేడుకల్లో పాల్గొని మహిళలను సన్మా నించారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను ఎస్సై అభినవ్ సన్మానించారు. పలు గ్రామపంచాయతీల్లో మహిళా అధికారులు, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఎంపీవో వీర స్వామి, ఎస్‌వో సునీత, వైద్యులు మౌనిక, ప్రియాంక, ప్రిన్సిపాల్స్ కరుణాకర్‌రావు, వెంకటేశ్వర్లు, కార్తీక్‌రావు, కృషిత, వందన, ఏఈవో అస్మా, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారం జీపీ ఆవరణంలో జీపీ ప్రత్యేకాధికారి శ్రీజ ఆధ్వర్యంలో తోటి మహిళా ఉద్యోగులను సన్మానించారు. ప్రత్యేకాధికారిని కూడా మహిళా ఉద్యోగులు సన్మానించారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరగా ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు మంచాల కవిత, కందుల రాజేశ్వరి హాజరయ్యారు. శ్రీరామోజు సువర్ణ, సంకినేని రాజేశ్వరి, మణెమ్మ, కల్లెం కళమ్మ, నాగేశ్వరమ్మ, కవిత, తిరుపతమ్మ, మంగమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు. చల్వాయి తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదో బెటాలియన్‌లో జరిగిన వేడుకలకు ఇన్‌చార్జి కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం బెటాలియన్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళలను సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు జేఏ.సద్దాంహుస్సేన్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహదేవపూర్ గ్రామ సభలో శనివారం మాజీ ఎంపీపీ బి.రాణిబాయిరామారావును, జడ్పీటీసీ గుడాల అరుణను ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, గ్రామ కార్యదర్శి కల్పన సన్మానించారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి) : చిట్యాల, గిద్దెముత్తారం పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు రవి, రవీందర్ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఐకేపీ వీవోఏలు, మహిళా టీచర్లు, జీపీ సిబ్బందిని సత్కరించారు. మాజీ ఎంపీ టీసీ పప్పుల విజయలక్ష్మి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది కేట్ చేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్ఈవో వేణు, పీహెచ్ఎన్ సంగీత, స్టాఫ్‌నర్సులు రమ, రమాదేవి, ఏఎన్ఎం శకుంతల, ఫార్మాసిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా సంఘాల నాయకులు, పలు స్వేచ్ఛంద సంస్థల్లో పని చేస్తున్న మహిళలను రాజకీయ నాయకులు సన్మానించారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగపేటలోని జ్యోతి మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం అప్పారావు జెండాను ఆవిష్కరించారు.



ఏటూరునాగారంలో తుడుందెబ్బ శ్రేణుల ర్యాలీ



మహిళలను సన్మానిస్తున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి దంపతులు

మంత్రి సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న నేతలు

గోవిందరావుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అన సూయ సీతక్కను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనం గా సన్మానించారు. మహిళా కాంగ్రెస్ ములుగు జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి-అనిల్‌యాదవ్, జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి, నాయకులు మణిచంద్, చుంచు కృష్ణ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజా మార్గం

జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ములుగు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజా మార్గమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్య లాల్ అన్నారు. శనివారం ములుగులోని జిల్లాకోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని మూడు బెంచీలను ఏర్పాటుచేసి 981 పెండింగ్ కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకుని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. లోక్ అదాలత్ తమ కేసులను రాజీ చేసుకుంటే అప్పీల్ ఉండదని, ఇదే అంతిమ తీర్పు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, డీఎస్పీ రవీందర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ కె.సునీల్‌కుమార్, న్యాయవాదులు వై.నర్సిరెడ్డి, ఎం.మహేందర్, కొండి రవీందర్, డి.సుధాకర్, స్వామిదాస్, ఆర్.రాజ్‌కుమార్, మేకల మానస, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, వివిధ బ్యాంకు మేనేజర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన విదేశీ జర్నలిస్టులు



రామప్ప ఆలయంలో విదేశీ జర్నలిస్టులు

వెంకటాపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న గయాన, శ్రీలంక, నేపాల్, టాంజానియా, సురేనమ్ దేశాలకు చెందిన జర్నలిస్టులు సందర్శిం చారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలకగా రామలిం గేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వారికి వివరించగా ఆలయ శిల్పకళ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఆతదుపరి సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేశారు. వారివెంట ఎంసీహెచ్ఆర్‌డీటీ శ్రీనివాస్, సతీష్, రవి, వెంకటాపూర్ ఎస్సై సతీష్, ఆర్ఐ విజేందర్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా అమెరికా దేశానికి చెందిన ఓనీల్, ఎరిన్‌లు రామప్ప దేవాలయాన్ని సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ ఉన్నారు.

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10నుంచి 12 వరకు జరిగే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ అమలును విజయవంతం చేయాలని ఏఎంవో కాటం మల్లారెడ్డి అన్నారు. శనివారం ములుగులో జరిగిన అభ్యసనాభివృద్ధి సర్వే శిక్షణ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న ఎఫ్ఎల్ఎన్‌ను పర్యవేక్షించేందుకు శాంపిల్ సర్వేలో భాగంగా జిల్లాలో ఎంపిక చేయబడిన పాఠశాలల్లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు రెండో తరగతి విద్యార్థుల సర్వే నిర్వహిస్తారని అన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు నందకిషోర్, మాస్టర్ ట్రెయినర్లు ఎల్.రమేష్; షర్మిల, ఎఫ్ఐలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అడవిలో చెలరేగిన మంటలు

వాజేడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం మంటలు చెలరేగాయి. వాజేడు నుంచి జగన్నాథపురం వెళ్లే దారిలో ఉన్న అడవిలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న ఫారెస్టు సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకొని ఆర్పివేశారు.

మామిడిగూడెంలో ముగిసిన జాతర

మంగపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తమల్లూరు గ్రామపంచాయతీ పరిధి గిరిజన గ్రామమైన మామిడిగూడెంలో సమ్మక్క- సారలమ్మల జాతర శనివారం ముగిసింది. చివరి రోజు వన దేవతలను ఊరేగింపుగా తీసుకెళ్లి మల్లూరు గుట్టకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు సాగానంపారు. ఆదివాసీ కుల పెద్దలు నన్నెబోయిన లక్ష్మణ్‌రావు, మారబోయిన లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో సమ్మక్క- సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు, నాగులమ్మ, కిష్టస్వామి, లక్ష్మీదేవర, పోతురాజులను ఆలయ దేవరబాల పూనెం జనార్ధన్, వడ్డె రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, దేవరకర్రలు ఆడించేవారు వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగుమల్లేష్‌తో పాటు ఆదివాసీ యూత్, మహిళ కమిటీ సభ్యులు గుళ్ల నుంచి మల్లూరు గుట్ట వరకు ధీంసా నృత్యాలతో తరలించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

ఏటూరునాగారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఏటూరునాగారం ఏజెన్సీలో శుక్రవారం రాత్రి సమయంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టులు వద్దు.. అభివృద్ధే ముద్దు.. శాంతియుత జీవనం మన హక్కు, అనుమానితుల సమాచారమిద్దాం, పోలీసులకు సహకరిద్దాం.. అనే నినాదాలతో పోస్టర్లను మండల కేంద్రంలోని బస్టాండ్, పాన్ షాపులు, ప్రధాన కూడళ్లలో తెలంగాణ ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరుతో అంటించారు. ఇదే తరహా పోస్టర్లు మండల పరిధిలోని పలు గొత్తికోయగూడెంలోనూ కనిపించాయి. ఈ పోస్టర్లను ఎవరు వేశారనేది తెలియడం లేదు. మావోయిస్టుల విధానాలు నచ్చని వారే ఇలాంటి పోస్టర్లు వేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఈ పోస్టర్లు ఎవరు వేశారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

వెంకటాపూర్ మండలంలో..

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గొత్తికోయగూడాలైన తౌరిచింతలపాడు, నందిపాడు, రేల్‌బండ, బండ్లపాడు, ఊట్లతోగు తదితర గూడాల్లో కూడా తెలంగాణ ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ఎన్నడూలేని విధంగా మండలంలో ఈ పోస్టర్లు అంటించడం స్థానికంగా చర్చ నీయాం శమైంది. ఈ పోస్టర్లు ఎవరు వేశారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

తప్పిపోయిన యువతి ఆస్థిపంజరం లభ్యం

తాడ్వాయి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపర్తి గ్రామం అడవి ప్రాంతంలో చాలా రోజుల క్రితం చనిపోయిన యువతి అస్థిపంజరం శనివారం లభ్యమైంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అగ్ని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు అడవుల్లో తిరుగుతున్న క్రమంలో అస్థిపంజరాన్ని వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి జలగలంచ గొత్తికోయ గుంపునకు చెందిన మాడవి హిడమి అనే యువతిగా అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే గుంపునకు చెందిన గొత్తికోయలు హిడమి అనే యువతి ఆరు నెలల క్రితం నుంచి కనిపించడం లేదని తెలిపారు.

కార్మికులకు వేసవి జాగ్రత్తలపై అవగాహన

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కేటీకే-2వ గనిలో ఉద్యోగులు, కార్మికుల కోసం వేసవి జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ వైద్యుడు హరిప్రసాద్ కార్మికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తీవ్ర వేసవికాలం వేడిమి కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందన్నారు. అధిక నీరు తాగడం, శారీరక ఒత్తిడిని తగ్గించుకోవడం, తేలికపాటి వస్త్రధారణ పాటించడం వంటి సూచనలు చేశారు.

బొగ్గు లారీ ఢీకొని ఎద్దు మృతి

కాటారం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి సమీపంలో 353(సీ)జాతీయ రహదారిపై శనివారం బొగ్గు లారీ ఎడ్లబండిని ఢీకొని ఓ ఎద్దు అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య అనే వ్యక్తి ఎడ్లబండిపై పొలం వద్దకు వెళ్లి ఇంటికి వెళ్తున్నాడు. ముళ్లకర్ర కిందపడటంతో కిందకు వంగి తీసుకుంటున్న క్రమంలో భూపాలపల్లి నుంచి గోదావరిఖనికి బొగ్గును తీసుకెళ్తున్న లారీ డ్రైవర్ ఎడ్లబండిని ఢీకొట్టాడు. దీంతో ఓ ఎద్దు దుర్మరణం పాలైంది. దీంతో బాధిత రైతు గ్రామస్థులతో కలిసి ఆందోళన చేయడానికి సిద్ధం కాగా లారీ ఓనర్ వచ్చి పరిహారం ఇస్తానని చెప్పినట్లు సమాచారం. ఈ ప్రమాద సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదని తెలుస్తోంది.

ఉపాధ్యాయుడిని విధుల్లో చేర్చుకోవాలి

మహాముత్తారం, మార్చి8(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా నిట్టూరు హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు లింగమల్ల శంకర్‌ను అకారణంగా సస్పెండ్ చేశారని, ఆయన్ను తిరిగ విధుల్లోకి తీసుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రమగిరి రాజు ఈ ప్రకటనలో డిమాండ్ చేశారు. అణగారిన వర్గానికి చెందిన ఉపాధ్యాయుడిపై కుట్రపూరితంగా చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను ప్రజాసంఘాల నేతలు కలవన్నుట్లు తెలిపారు.

రోడ్ల పనులకు నిధులు మంజూరు

మహదేవపూర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ రోడ్లకు రూ. 105.50 లక్షలను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేశారని అధికారులు, మాజీ ఎంపీపీ బి.రాణిబాయి రామారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అంబట్‌పల్లి రూ.10 లక్షలు, అన్నారం 10 లక్షలు, బెగ్లూర్ 10 లక్షలు, బొమ్మాపూర్ 5 లక్షలు, బ్రాహ్మణపల్లి 5 లక్షలు, చంద్రుపల్లి 5 లక్షలు, ఎడపల్లి 7.50 లక్షలు, ఎన్కపల్లి 5 లక్షలు, ఎల్కేశ్వరం 5 లక్షలు, ఎల్కేశ్వరం 5 లక్షలు, కాళేశ్వరం 10 లక్షలు, మద్దులపల్లి 5 లక్షలు, మహదేవపూర్ 5 లక్షలు, మెట్‌పల్లి 5 లక్షలు, పల్గుల 5 లక్షలు, పెద్దంపేట 5 లక్షలు, రాపల్లి కోట 4 లక్షలు, సూరారం 4 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎంపీపీ

మల్హర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ కింద నిధుల మంజూరు పట్ల మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఆర్ఆర్ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 72 లక్షలు, ఎంఆర్ఆర్ నిధులు రూ. 3 కోట్లతో బీటీ రోడ్ల పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

అటవీ చట్టాలపై అవగాహన

కాటారం, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం, గారెపల్లి, చిదినేపల్లి, బొప్పారం తదితర గ్రామాల్లో ఫారెస్టు అధికారులు ప్రజలకు అటవీ చట్టాలు, వివిధ అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వేసవిలో ఎరగడిమంటలు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, ఉచ్చుల నివారణపై అవగాహన కల్పించారు. కాటారం ఎఫ్ఆర్వో స్వాతి సూచనలతో యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం అడవులను సందర్శించి వన్యప్రాణులకు వేసవిలో తాగునీరు అందించేలా సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు సంజీవ్, మోనా కౌసర్, జయలక్ష్మి, రాజేందర్, బేస్ క్యాంప్ సిబ్బంది రాజు, అంకూస్, అంజి పాల్గొన్నారు.

12న కాళేశ్వరానికి

ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

మహదేవపూర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యార్ ఈ నెల 12న రానున్నారు. అధికారులతో సమావేశమై మే 15 నుంచి జరిగే సరస్వతీ పుష్కరాల అభివృద్ధి పనులను సమీక్షించనున్నారు. ఈ పనులకు రూ.25 కోట్లు నిధులు మంజూరు కాగా వాటి పురోగతిని ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించనున్నారు. వీఐపీ ఘాట్ వద్ద 150 మీటర్ల ఘాట్‌ను ఏర్పాట్లు చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు కాగా పలు నమునాలను పరిశీలించి కొత్త పద్ధతిలో కాళేశ్వరం ఘాట్ వద్ద ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో రెండు నెలలే గడువు ఉండడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడంపై కలెక్టర్, జిల్లా అధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్ర గాయపడ్డారు. శనివారం సాయంత్రం ఇవి చోటుచేసుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన గోపు శ్రీధర్‌రెడ్డి వంద పడకల ఆస్పత్రిలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో లారీల అడ్డా సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న లారీని గమనించకుండా ఢీకొన్నాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వందపడల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి వైద్యులు వరంగల్‌కు రెఫర్ చేసినట్లు తెలిసింది. ఇది జరిగిన కొద్దిసేపటికే హనుమాన్‌నగర్ చెందిన తూర్పాటి రవి మల్లంపల్లి వెళ్లి ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. బాంబులగడ్డ సమీపంలో చెరుకురసం వాహనాన్ని గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

గణపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులోపడి పశవుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని కర్కపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్కపల్లి గ్రామానికి చెందిన తొర్రి సంపత్ (35) పశువులు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే పశువులను మేతకు తీసుకువెళ్లిన క్రమంలో అవి గ్రామపంచాయతీ వెనుకాల ఉన్న కుంటలోకి నీళ్ల కోసం వెళ్లాయి. ఈ క్రమంలో పశువులు చెరువు నుంచి సాయంకాలం అయినా బయటికి రాకపోవడంతో వాటిని పంపేందుకు సంపత్ చెరువులోకి దిగాడు. జేసీబీ తీసిన గుంతలు పడి ఉండటంతో గమనించక అందులో నీటిమునిగి మృతి చెందాడు. స్థానికులు గమనించి అతడవిని బయటికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పలుగులలో మళ్లీ పులి సంచారం!

మహదేవపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) మూడు మండలాల ప్రజలకు 30 రోజులుగా పెద్ద పులి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పులి జాడ కోసం అటవీ శాఖ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మహదేవపూర్ మండలంలో పలుగుల, అన్నారం, బీరసాగర్, గుండ్రాత్‌పల్లి పాటు మహదేవపూర్ అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం. తాజాగా శనివారం ఉదయం పులి సంచారం చేసినట్లు అటవీశాఖ అధికారులు పాదముద్రలను గుర్తించారు. వాటి ఆధారంగా ఆధారంగా పులిని గాలిస్తున్నారు. అడవుల్లో అక్కడక్కడ ట్రాప్ కెమెరాలను అమర్చుతున్నారు.

వనదేవతలకు శాశ్వత మందిరాలు

నేడు తెరువనున్న టెండర్లు



కొత్త మందిరాల నమూనా

తాడ్వాయి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల శాశ్వత మందిరాల నిర్మాణం కోసం గతంలో కాంట్రాక్టర్లు దాఖలు చేసిన టెండర్లను అధికారులు ఆదివారం తెరువనున్నారు. మినీ జాతరకు ముందుగా మేడారం గ్రామంలో సమ్మక్క మందిరం రూ. 90లక్షలు, కన్నెపల్లిలో సారలమ్మ మందిరం రూ. 90లక్షల నిధులతో ప్రణాళికలు పూర్తి చేశారు. కాంట్రాక్టర్లు దాఖలు చేసిన టెండర్లను తెరచి వారికి పనులు అప్పగించనున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు బీఎంహెచ్ కృషి : లక్ష్మారెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు బీఎంఎస్ నిరంతరాయంగా కృషి చేస్తోందని ఆలిండియా కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్మిక పోరాట కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలిచిన యూనియన్లు సంవత్సరకాలంగా కార్మికులకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్ పెంపు, క్వార్టర్స్ సదుపాయంపై బీఎంఎస్ పోరాటం చేస్తోందన్నారు. కార్మికుల ఆరోగ్యానికి అనుగుణంగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను వ్యక్తపరిచినట్లు వివరించారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం, బోనస్ ఇవ్వాలని, కార్మికుడితో పాటు ఇంట్లో వారందరికీ వైద్య సదుపాయాల్ని అందించాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్, కార్యదర్శి మండ రమాకాంత్, ఎస్‌సీఎంకేఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో బాలిక కిడ్నాప్ కలకలం

(5వ పేజీ తరువాయి)

రప్పించారు. కారు వద్దకు ఆమె రాగానే అందులో ఎక్కించుకున్న అతి వేగంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి మీదుగా వరంగల్ వైపు వెళ్లారు. ఈ విష యం తెలిసిన బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్సైకు సమాచారమిచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి హైద రాబాద్ రిజిస్ట్రేషన్ కారులో వరంగల్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో జాతీయ రహదారి వెంటగల పలు పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేసిన పోలీసులు ఓ వాహనంలో బాలిక బంధువులతో కలిసి జాడ కోసం వెళ్లారు. కాగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసే హైదరాబాద్‌కు చెందిన యువకుడు బాలికను పరిచయం చేసుకుని ట్రాప్ చేసినట్లు తెలుస్తోంది. పోలీసులకు యువకుడి జాడ తెలిసినట్లు సమాచారం. దీంతో బాలికను, యువకులను పట్టుకుని వచ్చేందుకు పోలీసులు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.